

# సిందుబాదు బ్రదరిల్లా...

సిందుబాదు మనీపరుసు
కాదుకాదు బేవారుసు
నాదు మాట నమ్ము తమ్ము
డా యిది నిక్కమ్ము సుమ్ము.

(వి॥ మా॥ సిం॥)

అని కుబేరుడు గభాలున అంతర్ధానుడై పోయాడు. రాజు తిరిగీ స్టుడియో గేటు దగ్గరకు వచ్చాడు.

ఘూర్ఖాని ప్రసన్నుణ్ణి చేసుకోవడం, స్టార్ వాల్యూ లేని పిక్చరుకి డిస్ట్రిబ్యూషన్ సంపాదించడం అంతటి కష్టం. డైలాగు మార్చేస్తాను అని పట్టుబట్టిన పెద్దనటుడిని బతిమాలి ఆ 'మాట' దక్కించుకోవడానికి (సినిమాలోకి) దర్శక రచయితలు చూపేటంతటి నేర్పుకావాలి.

మధ్యాహ్నం కాల్‌షీటు కోసమని పెంద్రాళే ఐదుగంటలకల్లా వచ్చేసిన హీరో హీరోయిన్‌లను ఆరూ, ఆమాటకొస్తే ఆరున్నర వరకు కూడా సెట్‌మీద పనిచేయించ గలిగేటంతటి చాకచక్యం, మంచితనం కావాలి.

వరహాలరాజుకి ఈ సాధకబాధకాల లోతుపాతుల తీరు తెన్నుల మంచిచెడ్డల కుడి ఎడమలు కూడా తెలీవు కాబట్టి అతడు అటువంటి ప్రయత్నానికి పూనుకోలేదు. కొత్తరకం ట్రిక్కు, లేక ఉపాయం ఆలోచించాడు. ఉపాయం లేనివాణ్ణి ఊరు వెళ్ళగొట్టమన్నారు.

ఐదుగజాల ఇవతల ఉండగానే వరహాలరాజు మొహంమీద చిరాకు పులిమేసుకున్నాడు. ఆపైన తీవిని తగిలించాడు.

భ్రుకుటి ముడిచి ఆ మడతలో ఆలోచన ఒకటి బిగించాడు. అర్జెంటుపని ఉండి, అంతలోనే కారు దారిలో చెడిసందువల్ల కాలినడకనే వెళ్ళిపోతున్న షేరు హోల్డరులాగ హడావుడిగా గేటులోకి వెళ్ళబోయాడు —ఘూర్ఖా పెట్టవలసిన సలాంకు ప్రతి సలాం విసురుతూ.

వర్ధమాన నటతత్త్వవేత్త ఘూర్ఖాకి వరహాలరాజు తాపత్రయం క్షణార్ధంలో అర్ధమైంది. లోపల ప్రేమ పెల్లుబికింది. దాదాపు మందహాసం చేయబోయినంత పనిచేసి, ఘూర్ఖాలు అందులోనూ, డ్యూటీమీద వున్న ఘూర్ఖాలు నవ్వరాదన్న నియమాన్ని తలపుకు తెచ్చుకు తమాయించుకుని "తేరో తేరో" అన్నాడు కఠినంగా.

టేక్ మధ్యలో డైలాగు మర్చిపోయిన నటుడు తనంతట తనే కట్ అన్నట్టుగా, హఠాత్తుగా అపశ్రుతి పలికేసరికి ఆపి తూనాబొడ్డు అనుకుంటూ సిగ్గుపడి పాట మానేసిన కొత్త గాయకుడిలా ఠక్కున ఆగి హోల్డాన్ అనుకుని గిరుక్కుని వెనక్కి తిరిగాడు వరహాలరాజు.

బామ్మ చెంగునున్న బేడకాసుని దొంగతనంగా విప్పి తీసుకోబోయి అమ్మ కంటబడ్డ కుర్రనాగన్నలా సిగ్గుపడి నవ్వాడు.

'ఇప్పుకోటం లేదూ, చెంగుని ముడేసి పెడుతున్నానూ' అని బుకాయించి తప్పించుకో బోయిన వెఱ్రి నాగన్నలా మళ్ళీ నవ్వి, 'మైఅందర్ నహీ జారహే హూఁ సిర్ఫ్ దేఖ్ నా, తూ ఘూర్ఖా హై మై ఆద్మీ హూఁ' అనేశాడు గబగబ.

"నువ్వూ నేనూ కూడా మనుష్యులమే. ఇద్దరిలోనూ సేమ్ బ్లడ్ రన్ అవుతోంది. అంచేత నామీద దయయుంచి—"

—లోపలికి వదిలిపెట్టు సోదరా అంటూ మానవుడు సాటి మానవుడికి చేసుకునే విజ్ఞప్తి పైవాక్యాల తాత్పర్యం.

భాష చాలకపోయినా ఈ భావం ద్వార పాలకుడికి కంఠతావే. ప్రజల కష్టాలు వినివిని మామూలే అనుకుని యాదాలాపంగా తీసి అవతల పారేసే మంత్రుల మనసులలాగే, చిన్ననటుల మొరలు వినివిని మామూలే అనుకుని బకాయిల గురించి పట్టించుకోని చలనచిత్ర నిర్మాతల లాగే, డైరెక్టరు వివరణలూ సలహాలూ విని విని మామూలే అనుకుని పట్టించుకోని పెద్దనటుల లాగే, కాలుషీటు కాలిపోతోంది చప్పున రమ్మన్న టెలిఫోను మొరలు విని విని మామూలే అనుకుని కాలక్షేపం కావటం లేదని పడుకుని ఫాన్ లెటర్స్ చదువుకుని ఆనందించే బాక్సాఫీస్ స్టార్ల లాగే, ఆ ద్వారపాలకుడు కూడా అతిసహజంగానే ఓహో అనుకున్నాడు. హాహా అని నవ్వాలని కూడా అనుకున్నాడు. ఘూర్ఖాలు హిందీ, హిందూస్థానీ, ఉర్దూలలో పండితులు కాకపోవచ్చు. వ్యాకరణంతో రణం సాగించి దాని అంతు కనుక్కొని వాడే కావచ్చు. అయినా తుం తో హో మైతో హూఁ, వహ్ తో హై అనాలని వాళ్ళకి లీలగా తెలుసును. వరహాల రాజు తు హై, మై హై అనేశాడు. అందుకని నవ్వొచ్చింది. అయినా నవ్వకూడదని ముందరిపేరాలో అనుకున్నాడు కాబట్టి మాట తప్పనివాడు కాబట్టి ఈసారి కూడా మానుకున్నాడు.

'హైరో' అనగానే ఆగిన రాజు భుజాన చెయ్యివేసి 'హలో. మోటరాగయా' అన్నాడు.

రాజు కొంచెం తప్పుకున్నాడు. ఓ కారు బయటకు వెళ్ళిపోయింది. అందులో ఒకాయన విలాసంగా కూర్చుని, రాజుని చూచి హేళనగా నవ్వాడు.

రాజుకి పౌరుషం వేసుకొచ్చింది. "నవ్వు నవ్వు అలాగే నవ్వు. నీకేం. నువ్వుగాక ఇంకెవరు నవ్వుతారు. అప్పనంగా. బోల్డుడబ్బు, కారూ...." అని గొణుక్కున్నాడు రాజు.

'హలో మోటర్ ఆతీ' అంటున్నాడు ఘూర్ఖా.

"నాయనా హిందుబాదూ!" అంది లావుపాటి కంఠం ఒకటి కారులోంచి.

రాజు వెనక్కి తిరిగి చూశాడు.

"స్టూడియోలో కెళ్ళాలా? గూర్ఖా వద్దన్నాడా? ఫరవాలే కారెక్కు చెబుతా'' అని తలుపు తీశాడు ఆకంఠం తాలూకు ఆసామి.

రాజు కారులోపలికి ఆశ్చర్యపడ్డాడు.

తక్షణం ఆ కారు వెనక్కి జరిగి కుడివేపుకి తిరిగి మళ్ళీ వెనక్కి తిరిగి ఊరి శివారుదాటి చల్లటి నల్లనీడలమీద సాఫీగా సాగిపోయి ఒక పెద్ద చెట్టుకింద ఒకవారగా ఆగింది.

"స్టుడియోలోకి తీసుగెళ్తానన్నారుగదా" అన్నాడు రాజు ధైర్యం తెచ్చుకుని.

"తొందర్లేదు హిందుబాదూ. ముందర నే చెప్పేది విను!"

"నా పేరు హిందుబాదు కాదండి వరహాలరాజు"

"మోస్ట్ అన్ రొమాంటిక్ .... పోతే పోన్లే .... అసలు మనం విక్రమార్కుడి మార్కు కథల్లో మనుషులం—సిందుబాదూ, హిందుబాదూ ఇందులో రాకూడదు. ఇంకో బుక్కులో శాస్త్రీలు కాబోలు. అయితే నేం, నువ్వే కలగాపులగం చేసేశావు. ఇందాక కారులో – ఇంకో కారులో మనిషిని చూసి నువ్వేమన్నావు? – "నవ్వు నాయనా నవ్వూ .... అప్పనంగా డబ్బూ, కారూ దొరికితే నవ్వకేం చేస్తావు?" అని తిట్టుకోలేదూ? ఆ డైలాగు నీ బాబుగాడిదనుకున్నావా? ఆ మధ్య చార్రోలు క్రితం సింద్‌బాద్ ది సెయిలర్ ఇంటి అరుగుమీద కూర్చుని హింద్‌బాద్ అనే బీదవాడు సరిగ్గా ఇల్లాంటి డైలాగే అన్నాడు. అప్పుడు సింద్‌బాద్ జాలిపడి లేచి, హిందుబాదుకి తనకథ చెప్పేశాడు. అబ్బీ ఇది కష్టార్జితం అని చెప్పాడు." అంటూ గంభీరంగా ఉపన్యసించి సిగరెట్టు ముట్టించి నవ్వాడు కారు ఆయన.

"మీరేనాండి సిందుబాదు?" అన్నాడు రాజు.

"కాదు నాపేరు వీరభద్రరావు. అయామ్ ప్రొడ్యూసర్స్ బ్రదరిల్లా ....నేనొక ప్రొడ్యూసరు బామ్మర్దిని. చాలా విట్టీగా, హ్యూమరికల్‌గా మాట్లాడుతాను. మా పిక్చరులలో జోక్సు నేనే కట్టి కవిగారికిస్తాను" అన్నాడు వీరభద్రరావు.

''మరి మీకెందుకు కోపం ఆయన్నంటే.''

''ఆయనే మా బావగారు. ఆయన సిందుబాదంత మనిషి....ఎన్ని కష్టాలుపడి పెద్దవాడయ్యాడో తెలుసా?''

''తెలీదండి ఎన్ని?'' అన్నాడు రాజు.

జ్ఞాపకంలేదు. బోల్డుంటాయి. ఏం. తెలిసిందా. డబ్బు ఆయనకే కాదు ఎవరికీ అప్పనంగా రాలేదు. ఇది సాహసించి, కష్టించి సాధించింది. బేవార్సు అనుకుంటే ఇక్కడ పనికిరావు. పైగా నువు సినిమాలో చేరే వాడిలా కనబడుతున్నావు....'

రాజు గుండె చిన్న పిల్లి మొగ్గవేసింది ఆ ఇరుకులోనే చోటు చేసుకుని.

''వీరభద్రరావు గారూ! మీ యాశీర్వచనమువల్ల నేను యాక్టరునై పోతే మీ నోట్లో వీసెడు పంచదార పోస్తాను....మీరే నన్ను రక్షించాలి'' అన్నాడు. రావుగారు వెకిలిగా నవ్వారు.

''ఛాన్సిస్తే వీసె కాదు మణుగు పంచదార కొని గుమ్మరించే వాళ్ళున్నారు. అయినా పంచదారేంచేసుకుటాం లెస్తురూ... నే చెబుతాగా ఏంకొని పొయ్యాలో, మిమ్మల్ని చూస్తేనాకు చాలా జాలేస్తుంది. అసలు మా బావకి చెప్పి ఛాన్సిప్పిస్తాను గాని, కాస్త అర్జెంటుగా ఎన్నూరు వెళ్ళి రావాలి. పెట్రోలుకో పదిహేను ఉంటే ఇవ్వండి చెప్తా'' అన్నారు రావుగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

రాజు ఆ ఫీజు కట్టి ఇకిలించాడు. "ఔను కానండి, మీరు సినిమా వాళ్ళు కదా. మీ దగ్గర నోట్లకి నోట్లు కట్టలుగా ఉండవూ? కారు సీటుకిందా, టైరుల్లోపలా కూడా ఉంటాయని చెప్పాడు మా ముత్తెం?'' అన్నాడు.

రావుగారు పకపక నవ్వారు. ''ఎంత పిచ్చివాడివి. ఎందుకుండవు. ఉంటాయి. అయితే అందరికీ జీతాలిచ్చుకుంటూ పెద్ద స్టార్లకి బ్లాకుమనీ కట్టుకుంటూ పోతే అయిపోతాయి. అవన్నీ మా బావ చూసుకుంటాడనుకో. నువ్వు చెప్పినట్టు టైర్లలోను కూడా డబ్బు లేక పోలేదు. వెనుకటికోడు మట్టిని బంగారం చేస్తానని చెప్పి, పొలం దున్ని ఆ పంట అమ్మి, ఇదిగో అనలేదూ? అలాగే టైర్లలోంచి లైట్లలోంచి, సీట్లలోంచి కూడా డబ్బు తియ్యొచ్చు.''

"టైర్లతోటీ, లైట్లతోటీ కూడా పొలం దున్ని పంట అమ్ముతా రాండీ?....''

''బావుంది అందరూ పొలాలు దున్నితే ఇంక తిని కూర్చునే వాడెవడుట. టైరులోంచి డబ్బు తీయడం అంటే అదికాదు. కొంతమంది

పెట్టుబడి దార్లుంటారా? తాకట్టు పారిశ్రామికులు? వాళ్ళకివిస్తే డబ్బు పుడుతుంది. అయితే అదీకష్టమే. నాకీకారు ఎరువిచ్చిన మా పిక్చర్ హీరోయినుందనుకో. నామీద అట్టే నమ్మకంలేదు. అందుకని ఆవుకి నాలుగుకాళ్ళు కారుకి నాలుగుటైర్లు అని లెక్కపెట్టి గట్టిగా చెప్పి ఇస్తుంది. సాయంత్రం ఓ టైరు తక్కువైతే ఇట్టే పట్టేసుకుంటుంది. బ్రిలియంట్ గరల్ లే. చాలా సూక్ష్మబుద్ధి....సరేకాని, కారుదిగు. రేపుసరిగ్గా ఈవేళకే ఇటురా మిగతా పాతికా పట్టుకుని. జాయినై పోదుగాని .... ఉంటే యిప్పుడే ఇచ్చెయ్యి'' అన్నారు రావుగారు హుషారుగా.

''సార్ మరి నన్ను ఎగ్జామనేషను చేయఖ్ఖర్లేదా? నాయాక్షను చూడరా'' అన్నాడు రాజు దీనంగా.

రావుగారికి జాలేసింది. ''సరే చెప్పు నీ క్వాలిఫికేషన్లు .... రెండు ముక్కల్లో అయిపోవాలి. వివరాలన్నీ రేపు చెబుదువుగాని'' అన్నారు.

''సిక్స్ డ్రామాస్ .... హీరోయాక్షన్" అన్నాడు. సినిమాకాలం విలువ అప్పుడే పసి గట్టేసిన రాజు.

"వెరీగుడ్ .... వాటార్దై? ఏమిటవి?" అన్నారు రావుగారు చేతిన లేని గడియారంలో టైము చూసుకుని.

'ఆల్చిప్ప', 'నువ్వేనా'? 'ఇదాసంఘం!!!' 'డి.ఇ వో.' 'తిథి,'.... ఆ ...., వానపామండి. వానపాము." అన్నాడు రాజు.

"వండ్రఫుల్. నీ క్కావలసిన దానికన్న మూడింతలు అనుభవం ఉంది. టమిల్, కానరీస్ ఫిలుముల్లో కూడా చేరిపోవచ్చు. పోయిరా. రేపురా. నేవస్తా" అన్నారు రావుగారు కారు స్టార్టుచేస్తూ.

రాజు మనసులో సముద్ర కెరటాలు లేచి విరుగుతున్నాయి. నుదురుమీద రైళ్లు పరిగెడుతున్నాయి. పిడికిళ్లు బిగించాడు. లాభంలేదు. ద్రోహం కూడదు అనుకున్నాడు.

"మేష్టారోయ్" అని ఒక్క గావు కేకపెట్టి చప్పట్లు కొట్టి పరుగెట్టాడు.

కారు ఆగింది. 'ఏం' అన్నారు రావుగారు కాస్త కంగారుగా. ఊటీలో చొక్కా లేని వాడిలా, వణికి పోతున్నాడు రాజు.

"అబ్బే డబ్బుకి ఫరవాలేదు. తప్పకుండా ఛాన్సు యిప్పిస్తా. ఒట్టు. మై బ్రదర్‌లా ఈజె ప్రొడ్యూసర్స్ బ్రదర్లా...." అంటూ ధైర్యం చెప్పారు రావుగారు.

రాజుకి దుఃఖం ఆగలేదు. 'హైయామే ఫ్రెండ్.... నేను వానపాము కాదండి.... ఐ మీన్ ...."

"బావుందోయ్ నే నన్నానా నువ్వు వానపామువని.... ఇంకానయం".

"అబ్బే మీరు కాదుసార్.... అది కాదు సార్ .... వానపాము నాది కాదండి.... మిత్రద్రోహంచేసి పెద్ద అబద్ధం చెప్పేశాను. ఈ పాపానికి పశ్చాత్తాపం లేదండి" అన్నాడు రాజు భోరున ఏడిచేసి.

"ఏం పాపం చేశావు?....నాకిచ్చినవి దొంగనోట్లా? లేపోతే మా బావకి గూఢాచారిగా వచ్చావా?.... వాట్?" అన్నారు రావుగారు.

రాజు తెల్లబోయాడు నోటమాటరాక.

"క్యారక్టరాషన్ అనక చెయ్యొచ్చు. డైలాగులు తరవాత చెప్పొచ్చు ....ముందు నేనడిగింది చెప్పు. ఏమిటి నువ్వు చేసిన ద్రోహం" అన్నాడు.

"వానపాము నాటకంలో హీరో నేను కాదండి మా ముత్తెం. నావి మొత్తం అయిదే. 'సిక్సా అవుతాయి అని యిదికూడా కలిపేసుకో' అన్నాడండి వాడు రైలుకొచ్చి, అందుకని నేను అబద్ధం చెప్పేసి మీకు ద్రోహం చేసేశాను" అన్నాడు.

రావుగారు విరగబడి నవ్వారు. "హారినీ, నిష్కారణంగా హడల గొట్టేశావే .... ఇలాటి ద్రోహాలూ మోసాలూ పెద్దలెక్క .... ఎవరేనా నవ్వేస్తారు. గో....గో.... కం టుమారో" అంటూ మళ్ళీ స్టార్టు చేశాడు కారు.

కారు పదిగజాలు పోయేసరికి రాజుకి మళ్ళీ ఓ అయిడియా వచ్చింది. గబగబ చప్పట్లు కొట్టాడు. కాని కారు ఆగలేదు.

"హారినీ వీడిపేరు మనకి తెలీదే. కారూ మళ్ళీ గుర్తుపట్టలేము. ఎంతపని జరిగిపోయింది" అనుకున్నాడు.